# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 05 అక్టోబర్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 81

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

**ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..**



2లో

## రాష్ట్రంలో మహిళలకు కరువైన భద్రత

హెచ్చరించినా నిర్లక్ష్యం వీడని కాంగ్రెస్ సర్కార్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు



2లో

## మరో 20 లక్షల మందికి త్వరలోనే రుణమాఫీ

- ఏ ఒక్కరైతు కూడా అధైర్య పడవద్దు
- రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమాను అమలు చేస్తాం
- అన్ని సబ్సిడీ పథకాలను మళ్లీ పునరుద్ధరిస్తాం
- ఖచ్చితంగా రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతాం
- రుణ మాఫీ పూర్తి చేసి రైతు భరోసా ప్రారంభిస్తాం
- రైతన్నల ఆదరణతో అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం

తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

# కేబీఆర్ పార్క్ చుట్టూ రోడ్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్



- అండర్ పాస్, ఫ్లై ఓవర్ల నిర్మానానికి అనుమతి
- క్రీడాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- అంతర్జాతీయ స్థాయిలో కొత్తగా క్రీడా విధానం
- క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించేలా
- స్పోర్ట్స్ వర్సిటీ
- యంగ్ ఇండియా కోచింగ్ సెంటర్ల ఏర్పాటు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష

**హైదరాబాద్:** మూసీ ప్రక్షాళన ప్రతిష్టాకంగా చేపట్టిన తెలంగాణ ప్రభుత్వం, కేబీఆర్ పార్క్ చుట్టూ రోడ్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అండర్ పాస్, ఫ్లై ఓవర్ల నిర్మానానికి అనుమతి ఇస్తూ జీవో జారీ చేసింది. మరోవైపు స్పోర్ట్స్ పాలసీపై కూడా మరింత ఫోకస్ పెంచారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కేబీఆర్ పార్క్ జంక్షన్ నుంచి ఐదు అండర్ పాస్ ఫ్లై ఓవర్లు, కేబీఆర్ పార్క్ చుట్టూ రేడియల్ రోడ్ల విస్తరణకు లైన్ క్లియర్ అయింది. %ఖదీ=% పార్క్ చుట్టూ 6 జంక్షన్ల అభివృద్ధికి రేవంత్ సర్కార్ ఆమోదం తెలిపింది. కెబిఆర్ పార్క్ ఎంట్రన్స్ నుండి.. జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, రోడ్ 45, ఫిలింనగర్, అగ్రసేన్ మహరాజ్ విగ్రహం, బసవతారకం లవైపు అండర్ పాస్ ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపడుతారు. రూ.826 కోట్లతో ఆరు జంక్షన్ల అభివృద్ధి చేపట్టనున్నారు. తొలి దశలో 421 కోట్లతో ప్యాకేజీ-1లో జూబ్లిహిల్స్ చెక్ పోస్ట్..కేబీఆర్ పార్క్ ఎంట్రెన్స్ దగ్గర జంక్షన్లను అభివృద్ధి చేస్తారు.యూసఫ్‌గూడ వైపు నుంచి రోడ్డు నెం.45 జంక్షన్ వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్లను నిర్మిస్తారు. కేబీఆర్ ఎంట్రెన్స్ ముగ్ధ జంక్షన్ జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ వరకు 2 లేన్ల అండర్‌పాస్ నిర్మిస్తారు. పంజాగుట్ట వైపు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు మూడు లేన్ల ఫ్లైఓవర్, కేబీఆర్ ఎంట్రెన్స్ జంక్షన్ నుంచి పంజాగుట్ట వైపు మూడు లేన్ల అండర్ పాస్ ఏర్పాటు చేస్తారు.405కోట్లతో ప్యాకేజీ-2లో.. రోడ్ నెం.45 జంక్షన్‌ను అభివృద్ధి చేస్తారు. రెండో దశలో రోడ్ నెంబర్ 45, ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు వరకు అండర్ పాస్ నిర్మిస్తారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి రోడ్ నెంబర్-45 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్ ఫిలింనగర్ జంక్షన్ 1, అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్ నెం.45 జంక్షన్ వరకు 2 లైన్ల అండర్‌పాస్ అభివృద్ధి చేస్తారు. ఫిలింనగర్ జంక్షన్ నుంచి అగ్రసేన్ జంక్షన్ వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్ నిర్మాణంతోపాటు మహారాజా అగ్రసేన్ జంక్షన్ 1. క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ నుంచి ఫిలింనగర్ జంక్షన్ వరకు అండర్ పాస్ నిర్మిస్తారు. ఫిలింనగర్ జంక్షన్ నుంచి

రోడ్ నెంబర్-12 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ 1. కేబీఆర్ పార్కు నుంచి అగ్రసేన్ జంక్షన్ వరకు రెండు లైన్ల అండర్ పాస్ అభివృద్ధి చేస్తారు. అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్డు నెంబర్-10 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇప్పటికే పరిపాలన అనుమతులు వచ్చేశాయి. ఇన పనుల వేగవంతమే తరువాయి.

# రాముడికి, బిజెపికి సంబంధం ఏంటి ?.

**మత రాజకీయాలకు బలి కావద్దు.**

**గాంధీ కుటుంబం త్యాగాల మయం.**

**కష్టపడ్డ కార్యకర్తలకే భవిష్యత్తు.**

**పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 4:** రాముడికి, బీజేపీకి సంబంధం ఏంటని, మత రాజకీయాలకు ఎవరు బలి కావద్దనీ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ కుటుంబం త్యాగాల మయం అని, కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ కార్యకర్తలకే భవిష్యత్తు ఉంటుందని, అందుకు తానే ఉదాహరణ అని అన్నారు.పీసీసీ పగ్గాలు చేపట్టిన తరువాత తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు శు క్రవారం ఘనస్వాగతం పలికారు. బోర్గాం(పీ) చౌరస్తా నుంచి పాత కలెక్టరేట్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మహేశ్ కుమార్ గౌడ్ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ చార్జి దీపాదాస్ మున్షి, పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, రాజకీయాల్లో పని చేసుకుంటూ పోతే పదవులు వాటంతట అవే వస్తాయని, తన రాజకీయ జీవితంలో 38 ఏళ్లలో ఎన్నో కష్టాలు భరించానని, కష్టానికి పీసీసీ పదవి దక్కిందన్నారు.

**విబేధాలు ఉన్నా డీఎస్ నా గురువే.**

డీఎస్ మన మధ్య లేకపోవడం బాధాకరమని, ఆయన తనకు ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చారన్నారు. డీఎస్ తో విబేధాలున్నప్పటికీ ఆయన తనకు రాజకీయ గురువని అన్నారు. తనకు ఊహ తెలియని రోజుల్లో ఇందిరాగాంధీతో ఫోటో దిగానని, ఐదుగరు గాంధీలతో తనకు అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు.

**కెసిఆర్ అప్పుల కుప్పగా మార్చారు.**

తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల కాలంలో కెసిఆర్ అప్పుల కుప్ప చేశారని, అక్రమ సంపాదనతో ఫామ్ హౌస్ లో ఎంజాయ్ చేస్తున్నాడని విమర్శించారు. ఇప్పటి వరకు ఆయన ప్రజల్లోకి రావడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉందంటే అందుకు ప్రజలే కారణమని, పదేళ్ల కచ్చితంగా కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు.

**మోడి హామీలు ఏమయ్యాయి.**

కాంగ్రెస్ పార్టీ దేవుళ్ల పేరుతో ఏనాడు రాజకీయ చేయలేదనీ, గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబమని అన్నారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారనీ, మతాలు, కులాల పేరుతో జీవితాలను నాశనం చేసుకోవద్దనీ అన్నారు. శ్రీరామునికి, బీజేపీకి సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తాము కూడా శ్రీరాముని భక్తులమేనని, మా ఇంట్లో కూడా రోజూ శ్రీ రాముడి పూజ చేస్తామన్నారు. ఎన్నికల్లో మోడీ ఇచ్చిన హామీలు ఏమయ్యాని, ప్రజలకు బ్యాంకు ఖాతాల్లో వేతానన్న రూ.15లక్షలు ఎటుపోయాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సకాలంలో ధ్రువపత్రాలను పరిశీలించాలి

నేటితో డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేయండి

జిల్లా కలెక్టర్లకు సీఎం రేవంత్ ఆదేశం

9,090 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి



2లో



2లో

## అభ్యంతరాల స్వీకరణ తర్వాతే ఫలితాలు వెల్లడి

- ఈ దశలో కోర్టు జోక్యం సరికాదు
- గ్రూప్ 1పై హైకోర్టులో టీజీపీఎస్సీ వాదనలు
- గ్రూప్ 1 నోటిఫికేషన్‌పై పిటీషన్లపై విచారణ

# కొనసాగుతున్న హైడ్రా తరహా కూల్చివేతలు

## నాగార్జునసాగర్‌లోనూ హైడ్రా తరహా కూల్చివేతలు



హైదరాబాద్: హైదరాబాద్‌లోనే కాదు నాగార్జున సాగర్‌లోనూ హైడ్రా తరహా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. పేదోళ్ల ఇండ్లను మున్సిపల్ అధికారులు దౌర్జన్యంతో కూల్చివేస్తున్నారు. సాగర్ పైలాన్‌కు చెందిన ముడావత్ లక్ష్మణ్ అనే వ్యక్తి ఇంటిపైకి 20 మంది సిబ్బందిని తీసుకొచ్చి మున్సిపల్ అధికారులు భయభ్రాంతులకు గురి చేశారు. వాళ్ల ఇంటిని కూల్చివేశారు. ఈ కూల్చివేతలపై బాధితులు మండిపడుతున్నారు. తమ జాగాలో నిర్మాణం చేపడుతున్న పేదల ఇంటిని మున్సిపల్ కమిషనర్ శ్రీను ఉద్దేశపూర్వకంగానే కూల్చివేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అత్యుత్సాహం చూపిస్తూ ఎలాంటి సమాచారం లేకుండా తమ సిబ్బందితో వచ్చి ఇంటిని కూల్చివేయం అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు రేవంత్ రెడ్డి సర్కార్ పేదల కడుపు కొడుతున్నదని మండిపడుతున్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయడం చాతగాక హైడ్రా పేరుతో పేద ప్రజలపై దౌర్జన్యం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. మరోవైపు మూసీ బాధితులు కూడా రేవంత్ సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి అసలు ముఖ్యమంత్రిగానే మాట్లాడుతున్నాడా అని మండిపడుతున్నారు. లక్ష మంది మూసీ బాధితులం జేసీబీలు తీసుకొని రేవంత్ రెడ్డి ఇంటికి మీదకు వెళ్తామని హెచ్చరిస్తున్నారు. ఎంతమంది మీద కేసులు పెడతారు.. రేవంత్ రెడ్డిని చంపడానికి అయినా, చావడానికి అయినా సిద్దమని వార్నింగ్ ఇస్తున్నారు.

# 20 లక్షల మందికి రుణమాఫీ అందలేదు



2లో

- రుణమాఫీ కాలేదని వ్యవసాయ మంత్రే చెప్పారు
- సీఎం బండారం మరోసారి బట్టబయలైంది
- 100% రుణమాఫీ పూర్తి చేశామన్నది డొల్లమాటలే
- రాబందు ప్రభుత్వంతో రైతులకు ప్రయోజనం లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

# ఆవేశంలో ఉన్నా ఆలోచించి మాట్లాడాలి..

## సురేఖకు డీకే అరుణ చురకలు



హైదరాబాద్: రాజకీయాల్లో ఉన్నప్పుడు నోరు జాగ్రత్తగా పెట్టుకుని మాట్లాడాలని కొండా సురేఖకు హితవు పలికారు బీజేపీ ఎంపీ డీకే అరుణ. ఆవేశం వచ్చినా రాజకీయ నాయకులు ఆలోచించి మాట్లాడాలన్నారు. ఒక మహిళను పట్టుకొని, సినిమా కుటుంబాన్ని కించపరిచే విధంగా మాట్లాడం కరెక్ట్ కాదంటూ ఘాటు విమర్శలు చేశారు.మాజీ మంత్రి, ఎంపీ డీకే అరుణ శుక్రవారం చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో కొండా సురేఖ వ్యాఖ్యలపై స్పందించారు. ఈ క్రమంలో డీకే అరుణ మాట్లాడుతూ.. కొండా సురేఖతో నాకు మంచి అనుబంధం ఉంది. గతంలో ఇద్దరం కలిసి మంత్రులుగా పనిచేశాం. కానీ, ఒక సినీ కుటుంబంపై ఆమె చేసిన ఆరోపణలు అభ్యంతరకరం. సినిమా పరిశ్రమలో ఆ కుటుంబానికి ప్రత్యేక పేరు ఉంది. ఎవరి వ్యక్తిగత విషయాలతో రాజకీయాలు ముడిపెట్టడం సరికాదు.

# ప్రజలే మంచి, చెడు నిర్ణయిస్తారు



- బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం..
- కేసీఆర్‌ది నిర్మాణాత్మక ఆలోచన
- కాంగ్రెస్ పార్టీది కూలగొట్టే అరాచక పాలన
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

2లో

వేగుచుక్క
TELUGU DAILY NEWS
తెలంగాణ


# సకాలంలో ధ్రువపత్రాలను పరిశీలించాలి

హైదరాబాద్: తెలంగాణ డీఎస్సీ జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ (జీఆర్ఎల్) సెప్టెంబర్ 30న విడుదలైన సంగతి తెలిసిందే. ఫలితాలు విడుదలైన మరుసటి రోజు నుంచే అంటే అక్టోబర్ 1వ తేదీ నుంచే సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభమైంది. 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసిన అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు హాజరవ్వాలంటూ అభ్యర్థుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు, ఈమెయిల్‌లకు విద్యాశాఖ అధికారులు ఇప్పటికే సమాచారాలు పంపించారు. ఇక ఈ ప్రక్రియను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్టోబరు 5వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో అక్టోబరు 3న ఆయన ఈ మేరకు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. మొత్తం 11,062 మంది ఎంపికైన అభ్యర్థులకు అక్టోబరు 9న ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు వీలుగా జిల్లాల్లో వేగంగా ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేయాలని అన్నారు. అందుకు తగిన విధంగా సకాలంలో ధ్రువపత్రాలను పరిశీలించాలని సూచించారు. ఇప్పటికే 9,090 మందికి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని విద్యాశాఖ అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు.ముఖ్యమంత్రితో నిర్వహించిన ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంతోపాటు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ధ్రువపత్రాల పరిశీలన నేటితో ముగియనుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నీ జిల్లాల్లోని ఆయా కేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియకు అభ్యర్థులు హాజరుకావల్సి ఉంటుంది. మార్కులు, రోస్టర్ పాయింట్ల ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు ఈ ప్రక్రియ రేపటితో ముగుస్తుంది. ఇప్పటికే ఈ జాబితాలు అధికారిక వెబ్‌సైట్‌తోపాటు, డీఈఓ వెబ్‌సైట్లలోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. అభ్యర్థులు డీఈఓలు గుర్తించిన

## రాష్ట్రంలో మహిళలకు కరువైన భద్రత

**హైదరాబాద్:** రాష్ట్రంలో బాలికలు, మహిళలకు భద్రత కరువైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని హెచ్చరించినా నిర్లక్ష్యం వీడటం లేదని ఆగ్రహం వ్యక్తంచేరు. ప్రతిరోజు ఎక్కడో ఒకచోట అత్యాచార ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఇద్దరు మైనర్ బాలికలపై జరిగిన అత్యాచార ఘటన వార్త నన్ను తీవ్రంగా కలచివేసిందన్నారు. హోం మంత్రిత్వ శాఖను కూడా తానే నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఇందిరమ్మ రాజ్యం అని ఊదరగొట్టడమే కానీ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతలో మహిళలకు భద్రత లేదని తేటతెల్లమయిందంటూ ఎక్స్ వేదికగా విమర్శించారు. 'రాష్ట్రంలో బాలికలకు, మహిళలకు భద్రత కరువైంది. భద్రత కల్పించవలసిన ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోంది. ఇద్దరు మైనర్ బాలికలపై జరిగిన అత్యాచార ఘటన వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని సాక్షాత్తు అసెంబ్లీ వేదికగా ఈ ప్రభుత్వాన్ని హెచ్చరించినా నిర్లక్ష్యం వీడలేదు. ఫలితంగా ప్రతిరోజూ రాష్ట్రంలో ఎక్కడో ఒక చోట అత్యాచార ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. 9 నెలల కాంగ్రెస్ పాలనలో రెండు వేలకు పైగా అత్యాచారాలు జరిగాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. హోం మంత్రిత్వ శాఖను కూడా తానే నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారు. గత ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. షీ టీమ్స్, సఖి భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి భద్రత కల్పించింది. కానీ ఇందిరమ్మ రాజ్యం అని ఊదరగొట్టడమే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతలో మహిళా భద్రత లేదని తేటతెల్లమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి శాంతి భద్రతల పర్యవేక్షణకు చర్యలు చేపట్టాలి. మైనర్ బాలికలపై అత్యాచారానికి పాల్పడిన దుర్మార్గులకు కఠిన శిక్షలు పడేలా చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు'.

## మరో 20 లక్షల మందికి త్వరలోనే రుణమాఫీ

**హైదరాబాద్:** రుణమాఫీ గురించి పట్టించుకోని పార్టీలు ప్రస్తుతం మాట్లాడుతున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతన్నల ఆదరణతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. కష్టమైనా ఒక పథకాన్ని ఆపైన సరే రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమాను అమలు చేస్తాం.. అన్ని సబ్సిడీ పథకాలను మళ్లీ పునరుద్ధరిస్తాం.. ఖచ్చితంగా రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతాం అననారు. ఏ ఒక్క రైతు కూడా అధైర్య పడవద్దు అని కోరారు. అలాగే, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ.. 25 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం.. మరో 25 వేల కోట్లు రైతుల ఖాతాలోకి రావాల్సినవి ఉన్నాయి.. మరో 20 లక్షల మంది రైతులకు త్వరలో రైతు రుణ మాఫీ డబ్బులు జమ చేస్తామని ఆయన చెప్పుకొచ్చారు. రుణ మాఫీ పూర్తి చేసి రైతు భరోసా ప్రారంభిస్తామని తుమ్మల నాగేశ్వర రావు వెల్లడించారు.అలాగే, భారతదేశంలో ఎక్కువ పంటలను సాగు చేసే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తుమ్మల తెలిపారు. మన రాష్ట్రంలో ఒక కోటి 45 లక్షల టన్నుల వరి ధాన్యం పండిస్తున్నాం.. ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా సీఎం రేవంత్ రెడ్డి కష్టపడుతున్నాడు.. ఈ సీజన్లో రైతులు ఎక్కువగా సన్న ధాన్యాన్ని పండించారు.. 500 రూపాయలు అదనంగా ఇచ్చి సన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ను అధికారంలోకి తేవడానికి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రధాన పాత్ర పోషించారు అని తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. భవిష్యత్ లో కాంగ్రెస్ కు మంచి భవిష్యత్ ఉండాలనే మహేష్ కు పీసీసీ పదవి ఇచ్చింది.. రాష్ట్రంలో ఈ సీజన్ లో కోటి 43 లక్షల టన్నుల ధాన్యం పండుతుంది.. దేశంలోనే ఇది అత్యధిక దిగుబడి.. రైతులు ఎన్ని సన్నాలు పండించిన 500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తాం.. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఆయిల్ ఫాల్ ఫ్యాక్టరీల ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెప్పుకొచ్చారు.

## అభ్యంతరాల స్వీకరణ తర్వాతే ఫలితాలు వెల్లడి

హైదరాబాద్ :తెలంగాణ గ్రూప్ 1 నోటిఫికేషన్‌పై హైకోర్టులో పిటీషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. 2022లో జారీ చేసిన గ్రూప్–1 నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీ చేయడం చెల్లదని పేర్కొంటూ జి దామోదర్‌రెడ్డితోపాటు వికారాబాద్, యాదాద్రి, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన మరో అయిదుగురు ఈ పిటీషన్లను దాఖలు చేశారు. అంతేకాకుండా తాజాగా నిర్వహించిన గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రాథమిక కీలో తప్పులున్నాయని, వాటిని సవరించాలన్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ పుల్లా కార్తీక్ గురువారం విచారణ చేపట్టారు. విచారణ సమయంలో ప్రభుత్వం తరపు న్యాయవాది కీలక విషయాలను ధర్మాసనానికి తెలియజేశారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షల కీపై అభ్యంతరాలు స్వీకరించామని, వాటిని ఆయా సబ్జెక్ట్‌ల వారీగా నిపుణుల కమిటీకి పంపి, వారు ఆమోదించిన తర్వాతే ఫలితాలు విడుదల చేసినట్లు టీజీపీఎస్సీ హైకోర్టుకు నివేదించింది. మెయిన్స్ క్వాలిఫై అయిన వారికి త్వరలో మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయని తెలిపింది. ఈ దశలో కోర్టులు జోక్యం చేసుకోరాదని, దీనివల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం కలుగుతుందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి, టీజీపీఎస్సీ తరపున ఎం రాంగోపాల్‌రావులు వాదనలు వినిపించారు. గ్రూప్ 1 పరీక్షలు రాసిన 3 లక్షల మంది నుంచి ప్రిలిమ్స్ కీపై భౌతికంగా 721, ఆన్‌లైన్ ద్వారా 6,470 అభ్యంతరాలు వచ్చినట్లు న్యాయవాదులు తెలిపారు. వాటిని నిపుణుల కమిటీ పరిశీలించి, కొన్ని సిఫార్సులు చేసింది. వీటిని పరిగణనలోకి తీసుకుని రెండు ప్రశ్నలను తొలగించి కీని విడుదల చేశామని వివరించారు. ప్రస్తుతం పిటిషన్ దాఖలు చేసిన ఐదుగురిలో ఒక్కరే కమిషన్‌కు అభ్యంతరాలు తెలియజేసినట్లు తెలిపారు.

మిగిలినవారు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా కోర్టును ఆశ్రయించారన్నారు. రెండోసారి నోటిఫికేషన్ జారీని సవాల్ చేసిన అభ్యర్థితో పాటు కీని సవాల్ చేసిన పిటిషనర్లలో ముగ్గురు మెయిన్స్‌కు అర్హత సాధించినట్లు వెల్లడించారు. ప్రశ్నలకు విశ్లేషణాత్మకంగా ఆలోచించి సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఒకరిద్దరికి అర్థం కానంత మాత్రాన అవి తప్పులైనట్లు కాదన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహిస్తున్నామని, ఈ పిటిషన్‌లను కొట్టివేయాలని న్యాయమూర్తిని కోరారు. అయితే గురువారం కోర్టులో వాదనలు పూర్తికాకపోవడంతో తదుపరి విచారణను అక్టోబరు 4కి వాయిదా వేశారు. శుక్రవారం ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత కోర్టు అంతిమ నిర్ణయం ఏం చెబుతుందనేది వేచి చూడాలి.

# 20 లక్షల మందికి రుణమాఫీ అందలేదు

**హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విటర్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. 20 లక్షల మందికి రుణమాఫీ అందలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడంతో సీఎం బండారం మరోసారి బట్టబయలైందని కేటీఆర్ అన్నారు. 100% రుణమాఫీ పూర్తి చేశామన్న ముఖ్యమంత్రి డొల్లమాటలే అని మరోసారి తేలిపోయిందన్నారు. 2 లక్షల రుణమాఫీ పూర్తి చేశామన్న సన్నాసి మాటలు మోసం తప్ప మరొకటి



కాదా అని ప్రశ్నించారు. రాబందు ప్రభుత్వం ఉంటే రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, రేవంత్ అసమర్థత ధాన్యం దాతలకు కోలుకోలేని శాపమని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఒకవైపు డిసెంబర్ 9న ఏకకాలంలో చేస్తామని మాయమాటలు చెప్పి.. మరోవైపు 10 నెలల తర్వాత కూడా 20 లక్షల మందిని మోసం చేశారని మండిపడ్డారు. 2 లక్షల రుణమాఫీ పూర్తయిపోయిందన్న సన్నాసి మాటలు నయవంచన కాక మరేంటి ?? అని ప్రశ్నించారు. అధికారిక లెక్కల ప్రకారమే.. 20 లక్షల అన్నదాతలకు అన్యాయం జరిగితే అనధికారికంగా రుణమాఫీ కాని రైతులందరో ?? అని ట్విటర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. చేస్తామన్న

రుణమాఫీ ఇప్పటికీ పూర్తి చేయలేదు..

ఇవ్వాల్సిన

రైతుబంధు సీజన్ ముగిసినా ఇయ్యలేదన్నారు. రాబందుల ప్రభుత్వం ఉండి రైతులకు ఏం లాభం రేవంత్ చేతకానితనం.. అన్నదాతలకు కోలుకోని శాపం అని ట్విటర్ వేదికగా సీఎం పై మండిపడ్డారు.



## ప్రజలే మంచి, చెడు నిర్ణయిస్తారు

**సూర్యాపేట:** బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం..కేసీఆర్‌ది నిర్మాణాత్మక ఆలోచన, కాంగ్రెస్ పార్టీది కూలగొట్టే అరాచక పాలన అని సూర్యాపేట మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ సభ్యత్వ బీమా, సీఎం ఆర్ఎఫ్ చెక్కులు ), ఎల్‌వోసీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇల్లు ఇస్తారని నమ్మి ఓట్లేస్తే ఉన్న ఇల్లు కూలగొట్టే పరిస్థితి దాపురించిందన్నారు. రైతు భరోసా లేదు, ఉన్న రైతుబంధు ఇస్తలేరు. అభివృద్ధి చేతకాకనే అరాచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. హామీలను గలికొదిలేసి అభివృద్ధిని ఆటకెక్కించారు. ప్రజల సమస్యలు పట్టకపోగా.. వాళ్లే ఇబ్బందులకు గురిచేస్తున్నరు.. అభివృద్ధి చేసిందెవరో, ఆగం చేస్తున్నదెవరో ప్రజలంతా గమనిస్తున్నరు. హంస పాలను, నీళ్లను వేరు చేసినట్లు ప్రజలే మంచి, చెడు నిర్ణయిస్తారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. పార్టీ సభ్యత్వ బీమాతో కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు.

## ..మూసీ ప్రక్షాళన ఎట్టి పరిస్థితుల్లో ఆగదు

**హైదరాబాద్:** మూసీ ప్రక్షాళన ఎట్టి పరిస్థితుల్లో ఆగదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం అసోచాం ఆధ్వర్యంలో హెచ్ఐసీసీ నోవాటెల్ లో జరిగిన "అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్ 2024" కు ముఖ్య అతిథిగా హాజరై ప్రతిపక్ష పార్టీల ద్వంద్వ విధానాలపై మండిపడ్డారు.మూసీ పేరుతో జైకా నుంచి వెయ్యి కోట్లు రుణం తీసుకున్న కేటీఆర్, అధికారం పోగానే మూసీ ప్రక్షాళన వద్దని గగ్గోలు పెడుతున్నారని ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంటే, రాజకీయాలు తగదని ప్రతిపక్షాలకు సూచించారు.స్థిరమైన మౌళిక వసతుల నిర్మాణం, రాష్ట్ర సుస్థిరాభివృద్ధి కోసం ప్రగతిశీల నిర్ణయాలు తీసుకుంటున్నామని, గత పదేండ్ల తెలంగాణ విధ్వంసాన్ని సరిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తూ, సమ్మిళిత, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలవైపు సాగుతున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న అర్బన్ కల్చర్‌కు అనుగుణంగా తెలంగాణలో కూడా పట్టణీకరణ జరగవలసిన ఆవశ్యకత ఉందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. అందుకోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం భవిష్యత్ సవాళ్ళను ఎదుర్కొనేందుకు, అభివృద్ధికి బలమైన పునాదులు వేయడంతో పాటు రాష్ట్ర ముఖ చిత్రాన్ని మార్చేసేందుకు అనేక మౌళిక సదుపాయాలను నిర్మిస్తున్నదని వివరించారు.హైదరాబాద్ దశ దిశను మార్చేందుకు తమ ప్రభుత్వం కంకణం కట్టుకుందని చెప్పిన మంత్రి, అందులో భాగంగానే రోడ్లు, ఆర్ఓబీలు, ఆర్‌యూబీలు, కొత్త లింక్ రోడ్లు నిర్మించడం వంటి కీలకమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నదని చెప్పారు. అంతేకాకుండా అర్బన్ ఏరియాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ సవాల్‌తో కూడుకున్నదని చెప్పిన మంత్రి, అందుకోసం ఎస్‌టీపీలు నిర్మించి మెరుగైన మురుగు నీటి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఓఆర్ఆర్ పరిధిలో దాదాపు 40 శాతం జనాభా నివసిస్తుందని, ఇది 2028 నాటికి 50 శాతం దాటే అవకాశం ఉందన్నారు. అందుకు అనుగుణంగా పట్టణ విస్తరణ, మౌళిక వసతులను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు.

## చత్తీస్‌గడ్‌లో భారీ ఎన్‌కౌంటర్ ..

### 36 మంది మావోయిస్టుల హతం


### మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం



**ఛత్తీస్‌గఢ్:** ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రతా బలగాలు 36 మంది నక్సలైట్లను హతమార్చాయి. శుక్రవారం దంతెవాడ–నారాయణపూర్ జిల్లా సరిహద్దులో పోలీసులకు, నక్సలైట్లకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. సెర్చ్ ఆపరేషన్‌లో ఏకే–47, ఎస్ఎల్ఆర్‌తో పాటు ఇతర ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.అబుజ్మడ్‌లో 2 గంటల పాటు అడపాదడపా కాల్పులు జరిగాయి. దీని తర్వాత, కాల్పులు ఆగిపోవడంతో, సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సమయంలో మృతదేహాలు మరియు ఆటోమేటిక్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఒక రోజు ముందుగానే, నారాయణపూర్ మరియు దంతెవాడ జిల్లాల నుండి సైనికులను నక్సల్ ఆపరేషన్‌కు పంపారు. కాగా, మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమైన కాల్పులు సాయంత్రం వరకు కొనసాగిన్నట్టు తెలుస్తోంది. కేంద్ర బలగాలు, చత్తీస్‌గఢ్ పోలీసులతో కూడిన సంయుక్త కార్యాచరణ బృందం ఈ కాల్పుల్లో పాల్గొంది. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్‌లో మావోయిస్టులపై సైనికుల యాంటీ నక్సల్ ఆపరేషన్ నిరంతరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం(అక్టోబర్ 4) నారాయణపూర్, బీజాపూర్ పోలీసులు నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్‌లో భారీ విజయం సాధించారు. ఈ భారీ ఎన్‌కౌంటర్‌లో మంది మావోయిస్టలను సైనికులు హతమార్చారు. ఘటనా స్థలం నుంచి సైనికులు %ూఖ–47, ూా=% వంటి ఆటోమేటిక్ ఆయుధాలను, పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో సైనికులెవరూ మరణించినట్లు సమాచారం లేదు. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో, స్థానిక పోలీసు బలగాలు, డిఆర్‌జి, పారామిలటరీ బలగాలు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి నక్సలైట్ల స్థావరంపై దాడి చేసి 30 మంది నక్సలైట్లను హతమార్చినట్లు చెబుతున్నారు. మరణించిన మావోయిస్టుల మృతదేహాలతో శనివారం నారాయణపూర్ ప్రధాన కార్యాలయానికి భద్రతా దళాలు చేరుకుంటారని, అక్కడ గత 8 నెలల్లో 165 మంది నక్సలైట్లు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో హతమయ్యారని స్థానిక పోలీసులు చెప్పారు. నారాయణపూర్, దంతేవాడ జిల్లాల సరిహద్దులో నక్సలైట్లు ఉన్నారని సమాచారం అందడంతో భద్రతా బలగాలను నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ కోసం పంపినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 36 మంది మావోయిస్టులు హతమయ్యారని, వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఘటనా స్థలం నుంచి భారీ సంఖ్యలో ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. ఇరువైపులా కాల్పులు కొనసాగుతున్నాయి. ఈ విషయాన్ని దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ ధృవీకరించారు. మావోయిస్టుల ఉనికి గురించి సమాచారం ఉన్న ప్రదేశానికి భద్రతా దళాలు మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకున్నప్పుడు, మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారని దంతెవాడ ఎస్పీ చెప్పారు. ఘటన అనంతరం భద్రతా బలగాలు కూడా ఎదురు కాల్పులు జరిపాయని పోలీసు అధికారులు తెలిపారు. నారాయణపూర్, దంతేవాడ జిల్లాలకు చెందిన ఉమ్మడి బలగాలకు, నక్సలైట్లకు మధ్య ఎన్‌కౌంటర్ కొనసాగుతోందని చెప్పారు. ఆ ప్రాంతంలో అడపాదడపా కాల్పులు జరుగుతున్నాయి. ఎన్‌కౌంటర్‌లో భద్రతా దళాలంతా సురక్షితంగా ఉన్నట్లు సమాచారం అందిందని అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి మరింత సమాచారం ఆరా తీస్తున్నారు. బస్తర్ ప్రాంతంలోని సుక్మా జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రతా దళాలు మావోయిస్టుల తాత్కాలిక శిబిరాన్ని కూల్చివేసి, భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నాయి.

## ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్ఐలపై వేటు

హైదరాబాద్: తెలంగాణలో పోలీసుల ప్రక్షాళన మొదలైంది. అక్రమ దాడులను దుర్వినియోగం చేస్తున్న పోలీసు అధికారులపై వేటు పడింది. మల్టీజోన్–2లోని తొమ్మిది జిల్లాల్లో అక్రమ ఇసుక రవాణాను అరికట్టడంలో విఫలమైన ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్ఐలను వీఆర్‌వోలుగా కొనసాగిస్తూ మల్టీజోన్–2 ఐజీపీ వి.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో పెట్టినవారిలో సంగారెడ్డి రూరల్, తాండూరు రూరల్, తాండూరు టౌన్ సీఐలతో పాటు వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, వాడపల్లి, హాలియా ఎస్ఐలుగా ఉన్నారు. ఇసుక అక్రమ రవాణాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న కొందరిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు ఐజీ తెలిపారు. త్వరలో వారిని లూప్‌లైన్‌కు బదిలీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఒక సీఐ, 14 మంది ఎస్సైలు బదిలీ అయిన సంగతి తెలిసిందే.ప్రధానంగా ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రభుత్వానికి గండి పడుతుంది. అదేవిధంగా వాగులు, నదీ ప్రాంతాల్లో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. అదేవిధంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందని ప్రభుత్వం, రాష్ట్ర డీజీపీ సీరియస్‌గా ఉన్నారని ఐజీ తెలిపారు. ఇప్పటికే నేరస్తులతో పనిచేసిన ఆదివాదేవిపల్లి, వేములపల్లి, నారత్‌పల్లి, చండూరు, మాడుగులపల్లి, తిప్పర్తి, చింతలపాలెం, తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం, అచ్చంపేట, బొంరాస్‌పేట, తండు ఆర్, చిన్నంబావి ఎస్సైలను ఐజీ బదిలీ చేశారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఐజీ హెచ్చరించారు. దీనిపై ఇప్పటికే రహస్య విచారణ జరుగుతోందని తెలిపారు.




వేగుచుక్క
TELUGU DAILY NEWS
3 శనివారం 05 అక్టోబర్ 2024


## ఉత్తరప్రదేశ్‌లో ఢీకొన్న ట్రక్కు, ట్రాక్టర్ ప్రమాదంలో 10 మంది కార్మికులు మృతి!

**మీర్జాపూర్:** ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్ జిల్లాలో గురువారం అర్ధరాత్రి ట్రక్కు, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో 10 మంది కూలీలు మరణించారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద వార్త అందిన వెంటనే పోలీసు బృందం ఘటనా స్థలానికి చేరుకుంది. అనంతరం సహాయ, సహాయక చర్యలు ప్రారంభించారు. మిర్జాపూర్ %-% వారణాసి సరిహద్దులోని కచ్వాన్, మీర్జామురాద్ మధ్య జిటి రోడ్డులో తెల్లవారుజామున 1 గంటలకు ప్రమాదం జరిగిందని మిర్జాపూర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్‌పి) అభినందన్ తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ.., భదోహి జిల్లాలో నిర్మాణ పనులు చేసి తిరిగి వస్తున్న ట్రాక్టర్ ట్రాలీలో 13 మంది కార్మికులు ఉన్నారు. వారి వాహనాన్ని వెనుక నుండి ట్రక్కు ఢీకొట్టింది. దాని కారణంగా డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీలో ప్రయాణిస్తున్న 13 మందిలో 10 మంది మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే ట్రామా సెంటర్, వారణాసికి పంపారు. అక్కడ వారి పరిస్థితి సాధారణంగా ఉందని సమాచారం. ప్రమాదం తర్వాత ట్రక్కు బాగా దెబ్బతిన్నదని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) ఓపీ సింగ్ తెలిపారు. ఇటాహ్ జిల్లా నుంచి వస్తున్న ట్రక్కులో గాజు షీట్లు లోడ్ చేశారు. ఘటన తర్వాత లారీ డ్రైవర్, సహాయకులు అక్కడి నుంచి పరారయ్యారు. మృతులను భాను ప్రతాప్ (25), వికాస్ కుమార్ (20), అనిల్ కుమార్ (35), సూరజ్ కుమార్ (22), సనోహర్ (25), రాకేష్ కుమార్ (25), ప్రేమ్ కుమార్ (40), రాహుల్ కుమార్, అలియాస్ టిల్లు (26), నితిన్ కుమార్ (22), రోషన్ కుమార్ (17) లుగా గుర్తించారు. ఈ ప్రమాదంలో ఆకాష్ కుమార్, జముని, అజయ్ సరోజ్ గాయపడ్డారు. వీరంతా వారణాసి జిల్లా వాసులు.

## కన్వీనర్ కోటా సీట్లకు వెబ్‌ఆప్షన్లు ప్రారంభం..

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్ల కోసం రెండో రౌండ్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఈ రౌండ్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రెండో రౌండ్‌లో వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు కాళోజీ ఆరోగ్య యూనివర్సిటీ ప్రకటన జారీ చేసింది. అక్టోబరు 4 మధ్యాహ్నం నుంచి 6వ తేదీ మధ్యాహ్నం 1 గంటలోపు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని ప్రకటనలో తెలిపింది. ఇక కన్వీనర్ కోటా కింద మొదటి రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు అక్టోబరు 4వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటలోపు కేటాయించిన మెడికల్ కాలేజీలో చేరాల్సి ఉంటుందని యూవర్సిటీ పేర్కొంది. మరోవైపు మేనేజ్‌మెంట్ కోటా కింద మొదటి దశ కౌన్సెలింగ్‌లో ఎంబీబీఎస్ సీట్లను దక్కించుకున్న విద్యార్థుల వివరాలను కూడా కాళోజీ ఆరోగ్య యూనివర్సిటీ గురువారం ప్రకటించింది. కాలేజీల వారీగా అడ్మిషన్లు పొందిన విద్యార్థుల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఆర్మీ కేటగిరీ కన్వీనర్ కోటా సీట్ల ప్రాధాన్య క్రమాన్ని సైనిక్ వెల్ఫేర్ బోర్డు ప్రకటించింది.

# దసరా కానుకగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు.

- ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ కు 3500 నుండి 4000 ఇందిరమ్మ ఇండ్లు.
- యావత్ దేశానికి ఆదర్శంగా నిలువనున్న నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం.
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి.
- మంత్రులు కోమటిరెడ్డి, కొండా సురేఖతో కలిసి జిల్లా ప్రగతిపై సమీక్ష.
- ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా పరిరక్షించాలని అధికారులకు ఆదేశం.







**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 4**

: నిజామాబాద్ జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రోడ్లు - భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ శుక్రవారం సమీక్ష జరిపారు. ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి చేరుకున్న మంత్రులకు హెలీప్యాడ్ వద్ద కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించిన సందర్భంగా, జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల ప్రగతి, ఎల్.ఆర్.ఎస్, విద్య, వైద్యారోగ్య శాఖల పనితీరు, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలెట్ సర్వే తదితర అంశాల అమలు తీరు గురించి కలెక్టర్ మంత్రుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఒక్కో అంశం వారీగా వివరాలను అడిగి తెలుసుకుంటూ, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ధరణి దరఖాస్తులను పరిష్కరించే విషయంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపడం ప్రశంసనీయమని ప్రభుత్వం పక్షాన అభినందనలు తెలియజేశారు. అయితే, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి కూడా ఇదే తరహాలో చొరవ చూపుతూ, వాటిని తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను విజయదశమి కానుకగా అర్హులైన



వారికి కేటాయించేందుకు గాను జిల్లా ఇంచార్జి మంత్రి పర్యవేక్షణలో నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికకు త్వరలోనే ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయనుందని అన్నారు. నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, శానిటేషన్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, ఈ పనుల కోసం అవసరమైన నిధులను కూడా కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు. వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్న అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా రెండుమూడు నెలల్లో పూర్తి చేయాలని గడువు విధించారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే నిరుపేదల రాజ్యం అని స్పష్టం చేసిన మంత్రి పొంగులేటి, అర్హులైన వారికి తొలి విడతగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రభుత్వం త్వరలోనే 3500 నుండి 4000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనుందని ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ కారణంగా రైతులు అభద్రతా భావానికి గురి కావాల్సి వచ్చిందని మంత్రి పొంగులేటి ఆక్షేపించారు. ధరణి ఇబ్బందులను అధిగమించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం అన్ని వర్గాల వారిని సంప్రదించి, మేధావులు, నిపుణుల అభిప్రాయాలు, సూచనలను పరిగణలోకి తీసుకుని సమగ్రంగా నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ నెలాఖరులోపు అమలులోకి రానున్న నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం యావత్ దేశానికే ఆదర్శంగా నిలువబోతోందని అన్నారు. రెవెన్యూ చట్టాలలో మార్పులు చేయాలనుకునే ఇతర రాష్ట్రాలకు తెలంగాణ రాష్ట్ర కొత్త ఆర్.ఓ.ఆర్ యాక్టు ఖురాన్, భగవద్గీత, బైబిల్ గా ఉపకరిస్తుందని వ్యాఖ్యానించారు.

విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నందున, వీటి పనితీరును మెరుగుపరుచుకుని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని హితవు పలికారు. విద్య, వైద్య శాఖల్లో సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తరపున తక్షణ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో వైద్యుల ఖాళీలను రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆలోపు కాంట్రాక్టు పద్ధతిన డాక్టర్లను నియమించుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ. 637 కోట్ల నిధులను ఖర్చు చేసిందని వివరించారు. కాగా, ఎక్కడ కూడా ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. కబ్జాలకు పాల్పడిన వారు ఏ స్థాయిలో ఉన్నా సరే, వారి నుండి సర్కారు భూములను స్వాధీనం చేసుకుని వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం పైలెట్ సర్వే నిర్వహిస్తోందని తెలిపారు. వచ్చే జనవరి నెల నుండి రేషన్ షాపుల ద్వారా అందించనున్న సన్న బియ్యం పంపిణీతో పాటు, ఇందిరమ్మ ఇళ్ళు, ఉచిత విద్యుత్, రూ. 500 లకు వంట గ్యాస్, రాజీవ్ ఆరోగ్య శ్రీ వంటి అన్ని పథకాలకు భవిష్యత్తులో ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రామాణికంగా నిలుస్తుందని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వాటిని పరిష్కరిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అందరికి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రూపొందించబడిన డిజిటల్ కార్డులను అందించడం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. నిరుపేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న తమ ప్రభుత్వానికి ప్రతిపక్షాలు విలువైన సూచనలు అందిస్తూ పాలనలో భాగస్వాలుము కావాలని పిలుపునిచ్చారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్, అదనపు కలెక్టర్లు అంకిత్, ఎస్.కిరణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనల"పై అవగాహన కల్పించాలి.





## మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వివేకానంద రెడ్డి.

## ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో టీచర్స్ కి ప్రత్యేక శిక్షణ.

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, అక్టోబర్ 4:**

విద్యతో పాటు పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు ఉపాధ్యాయులు "ట్రాఫిక్ నిబంధనల"పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆర్మూర్ మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వివేకానంద రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్మూర్ మండల ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో టీచర్స్ కి బోధనా మేలుకువల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు, పాటించాల్సిన జాగ్రత్తలపై టీచర్లకు వివరించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తే, వారి కుటుంబ సభ్యులకు తెలువడంతో పాటు భవిష్యత్తులో వారికి ఎంతో ఉపయోగ పడుతుందనీ అన్నారు. టీనేజి యువత నిబంధనలు పాటించకుండా , ఇష్టానుసారం వాహనాలను నడపడం వల్ల ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉందన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో బైక్ లు ఇవ్వవద్దని సూచించారు.అనంతరం పలువురు మాట్లాడుతూ, ఉపాధ్యాయ బృందానికి మారుతున్న కాలానికి అనుగుణంగా, రాబోయే తరానికి అవసరమయ్యే బోధనా పద్ధతులు, మెలుకువలు పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మండల ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షులు భరత్ చంద్ర మల్లయ్య, కార్యదర్శి శ్రీ విద్య ప్రవీణ్ పవార్, కోశాధికారి స్కాలర్స్ వేణు, శ్రీ భాషిత సుందర్, శ్రీ మోడల్ మల్లేష్, నలందా సాగర్, మానస గణేష్, వంశి ప్రజ్ఞ, కాంతి శశాంక్, ఇతర పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసులు సత్వరమే పరిష్కరించాలి.

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.**

**అణగారిన ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వీడీసీలపై కఠిన చర్యలు.**

**జిల్లా కలెక్టర్, సీ.పీల పనితీరు భేష్ : చైర్మన్ కితాబు.**





**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 4**

: ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ల ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఆయా సమస్యలపై బాధితుల నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అన్ని రకాల పెండింగ్ కేసులను నెల రోజుల్లో పరిష్కరించాలని, అవసరమైతే స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసుకుని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సూచించారు. నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాలలో గడిచిన మూడు,నాలుగు దశాబ్దాల కాలంగా గ్రామాభివృద్ధి కమిటీలు ఆధిపత్యం కొనసాగిస్తున్నాయని అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం వీడీసీలు కృషి చేయాలని, ఎవరు కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని చైర్మన్ సూచించారు. ఎస్సీ, ఎస్టీలు, ఇతర అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసే గ్రామాభివృద్ధి కమిటీలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ వెంకటయ్య కలెక్టర్, సీ.పీలకు సూచించారు. పోలీస్ స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పక్కాగా అమలు జరిగేలా చూడాలని, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలని హితవు పలికారు. ఎస్సీ, ఎస్టీలను వేధింపులకు గురి చేసే అధికారులపై కమిషన్ కఠిన చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీలకు సమస్యలు ఎదురైతే అక్కడికి కమిషన్ వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తోందని తెలిపారు.

ప్రతీ నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే, ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని అన్నారు. కాగా, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ చక్కగా పని చేస్తున్నారని జిల్లా ప్రజలలో మంచి పేరు వినిపిస్తోందని ఈ సందర్భంగా చైర్మన్ వారిని అభినందించారు.

అట్రాసిటీ కేసులకు సంబంధించి 41 సీఆర్పీసీ కింద పోలీస్ స్టేషన్లకు పిలిపించుకుని స్టేషన్ బెయిల్ ఇస్తుండడం వల్ల అట్రాసిటీ చట్టం నీరుగారిపోయే ప్రమాదం నెలకొందని చైర్మన్ అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఇప్పటికే ముఖ్యమంత్రితో చేర్చామని, ఈ నెలాఖరులో ఢిల్లీకి వెళ్లి కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిని, న్యాయశాఖ మంత్రిని కలిసి విన్నవించనున్నామని వెల్లడించారు.

ఈ సమీక్షలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, రేణిగుంట ప్రవీణ్, నీలాదేవి, జిల్లా శంకర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఎస్సీడీఓ బి.నిర్మల, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రాపై అఖిలపక్ష సమావేశ ఏర్పాటును స్వాగతిస్తున్నాం

హైదరాబాద్: హైడ్రాపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అయితే అఖిలపక్ష సమావేశానికి పిలుస్తామని ముఖ్యమంత్రి చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. హైడ్రాపై అఖిలపక్ష సమావేశం.. ముందే పెట్టి ఉంటే బుచ్చమ్మ చనిపోయేది కాదని తెలిపారు. నల్లచెరువులో బీఆర్ఎస్ నేతల ఆక్రమణలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చేసినవి ఆరోపణలు మాత్రమేనని.. ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ... నల్ల చెరువు చుట్టూ బీఆర్ఎస్ హయాంలో కట్ట కట్టామని తెలిపారు. రైతులు కోర్టుకు వెళ్లడంతో జీహెచ్ఎంసీ అధికారులు కట్టను తొలగించారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు చెరువులు ఆక్రమిస్తే అధికారం కాంగ్రెస్ ప్రభుత్వం చేతుల్లో ఉంది విచారణ చేసుకోవాలని రేవంత్ రెడ్డికి సూచించారు. కాజాకుంటలో ఇద్దరు జడ్జీలకు ఏపార్టీ నేతలు భూములు అమ్మారో సీఎం రేవంత్‌రెడ్డి విచారణ చేయించాలని అన్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను ఒప్పించి వారి ఇళ్లను ఖాళీ చేయించాలని కోరారు. రేవంత్ ప్రభుత్వం ఇచ్చే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కట్టించింది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మరిచిపోవద్దని అన్నారు. చెరువులు ఎవరు కబ్జా చేశారో సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి బీజేపీ హైదరాబాద్ నగరానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. హైడ్రా భాదితులకు అండగా బీజేపీ నుంచి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఒక్కరూ మాత్రమే మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు.

వేగుచుక్క
శనివారం 05 అక్టోబర్ 2024






# అలియా.. 'ఆల్ఫా' రిలీజ్ డేట్ ఎప్పుడంటే!



అలియా భట్, శార్వరీ వాఘ్‌లు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆల్ఫా'. శివ్ రావేల్ దర్శకత్వంలో ఇది రానుంది. బాలీవుడ్ అగ్ర నిర్మాణసంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్ దీన్ని నిర్మిస్తుండడంతో పాటు అలియా యాక్షన్ కోణాన్ని రుచి చూపించడానికి సిద్ధమవుతుండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి. తాజాగా దీని రిలీజ్ డేట్‌ను ప్రకటించారు.

## సినీ నటుడు మోహన్‌రాజ్ కన్నుమూత



దక్షిణాదికి చెందిన ప్రముఖ సినీనటుడు మోహన్ రాజ్ (72) కన్నుమూశారు. తెలుగుతోపాటు మలయాళం, తమిళ, కన్నడ చిత్రాల్లోనూ ఆయన నటించి మెప్పించారు. గురువారం కేరళలోని తిరువనంతపురంలో తుదిశ్వాస విడిచారు. నటుడు, దర్శకుడు దినేశ్ పనికర్ ఈ విషయాన్ని తెలియజేశారు. మోహన్‌రాజ్‌కు భార్య ఉష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మోహన్‌రాజ్ గత నాలుగు రోజులుగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న మోహన్‌రాజ్‌ను వెంటిలేటర్ పై ఉంచారు. గురువారం మధ్యాహ్నం పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచినట్లు వైద్యులు తెలిపారు. గత కొంతకాలంగా పార్కిన్సన్ తో బాధపడుతున్న మోహన్ రాజ్ కు ఇటీవల గుండెపోటు కూడా వచ్చింది. చికిత్స నిమిత్తం మోహన్‌రాజ్‌ను చెన్నలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకెళ్లాల్సిందిగా వైద్యులు సూచించారు. దీంతో కుటుంబసభ్యులు ఆయనను తిరువనంతపురంలోని కంజిరంకులం తీసుకువచ్చారు. అక్కడే మోహన్‌రాజ్ మృతి చెందారు.తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సినిమాల్లో మోహన్‌రాజ్ ఎక్కువగా విలన్ పాత్రలనే చేశారు. తెలుగులో లారీ డ్రైవర్, శివయ్య అసెంబ్లీ రౌడీ, సమరసింహారెడ్డి చెన్నకేశవ రెడ్డి, తదితర సినిమాల్లో విలన్ పాత్రల్లో కనిపించారు. మోహన్ రాజ్ దాదాపు 300లకుపైగా సినిమాల్లో నటించారు. మోహన్‌రాజ్ మృతి పట్ల కేరళ సీఎం పినరయి విజయన్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి సాజి చెరియన్ సంతాపం తెలిపారు. పలువురు సినీప్రముఖులు మోహన్‌రాజ్ మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. కాగా, మోహన్‌రాజ్.. కిరిక్కాడాన్ జోస్ పేరుతో మలయాళంలో వందల చిత్రాల్లో నటించి మెప్పించారు. 1089లో సిబి మలయిల్ దర్శకత్వంలో వచ్చిన కిరీదామ్ సినిమాతో మంచి పేరు తెచ్చుకున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఆఫీసర్‌గా పనిచేసే మోహన్ రాజ్.. సినిమాలపై మక్కువతో సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టారు.

## మొదలైన దళపతి విజయ్ ఆఖరి చిత్రం

మిళ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టుల్లో ఒకటిగా భావిస్తున్నచిత్రం 'దళపతి 69' ఈ చిత్రంలో తలపతి విజయ్ హీరోగా నటిస్తుండగా, ప్రముఖ దర్శకుడు హెచ్ వినోత్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం పట్ల అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొనడం విశేషం. ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా కనిపించనుంది. అలాగే మలయాళ సినిమాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన మమతా బాయిజు కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ నటులు ప్రకాష్ రాజ్, ప్రియమణి, నరేన్, గౌతమ్ వాసుదేవ్ మీనన్ మరియు బాలీవుడ్ స్టార్ బాబీ డియోల్ వంటి సీనియర్ నటులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. విజయ్ మరియు అనిరుధ్ కాంబినేషన్ గతంలో పలు విజయాలను అందించినందున, ఈసారి మళ్లీ మాజిక్ చేసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'దళపతి 69' చిత్రం పూజా కార్యక్రమం గ్రాండ్‌గా జరగగా, ఇందులో విజయ్, హెచ్ వినోత్ మరియు మిగతా తారాగణం హాజరయ్యారు. ఈ చిత్రం విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. విజయ్ అభిమానులకు ఈ చిత్రం పండగలాంటిదిగా భావిస్తారు, మరియు ఇది విజయ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని నమ్మకంగా భావిస్తున్నారు.



## ఆకట్టుకునే సస్పెన్స్ థ్రిల్లర్ 'కలి'




శివ సాషు దర్శకత్వంలో లీలా గౌతమ్ వర్మ నిర్మాణ సారధ్యంలో రుద్ర క్రియేషన్స్ బ్యానర్ పై తెరకెక్కిన సినిమా 'కలి'. సస్పెన్స్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ సినిమా కి జీవన్ బాబు సంగీతం సమకూర్చగా ఈరోజే విడుదలైన ఈ సినిమా ఎలా ఉందో ఈ సమీక్షలోకి వెళ్లి తెలుసుందాం. శివరామ్ (ప్రిన్స్), వేద (నేహా కృష్ణ) ఇద్దరు ప్రేమించుకున్నారు. పెద్దలకు ఇష్టం లేకపోయినా ఎదురించి పెళ్లి చేసుకున్నారు. తన మంచి తనంతో తండ్రి వారసత్వం నుంచి వచ్చిన ఆస్తులను పోగొట్టుకుంటాడు శివరామ్. తన బంధువులే తనను మోసం చేయడం తో శివరాం బాధపడుతుంటారు. తన చేతకానితనంవల్లే తమ పరిస్థితి ఇలా అయ్యిందని వేద శివరామ్ ను వదిలివెళ్లిపోతుంది. ఒంటరితనంతో ఉన్న శివరామ్ కి సూసైడ్ ఆలోచనలు వస్తాయి. ఈ సమాజానికి తాను ఫిట్ అవునని ఉద్దేశ్యంతో ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధమవుతాడు. ఆ సమయంలోనే తన ఇంటికి ఎవరో వస్తారు. ఓ గేమ్ ఆడదామా అని ప్రిన్స్ ని రెచ్చగొట్టి ఆ ఆటను ముందుకు తీసుకెళతాడు. ఇంతకీ శివరామ్ ఇంటికి వచ్చిందెవరు? సూసైడ్ చేసుకోవాలనుకున్న శివరామ్ చివరికి ఎం చేశాడు. అనేదే ఈ సినిమా కథ. ప్రిన్స్ తన పాత్రలో సాదాసీదా వ్యక్తిగా కనిపించి మెప్పించాడు. నరేశ్ అగస్త్య కలి పురుషుడి పాత్రలో అద్భుతంగా నటించాడు. నేహా కృష్ణ, మణి చందన, సివిఎల్ నరసింహారావు, కెదార్ శంకర్ తమ పాత్రలను నిజాయతీగా చేశారు. చిన్న పాత్రలో కనిపించిన గాయత్రి గుప్తా తన నటనతో ఆకట్టుకుంది. ప్రియదర్శి, మహేష్ విట్టా, అయ్యప్ప శర్మ వాయిస్ ఓవర్ పనితనం పాత్రలకు మరింత బలం చేకూర్చింది. చిత్రం ఎక్కువ శాతం ఒకే ప్రదేశంలో, రాత్రి సమయంలోనే చిత్రీకరించబడింది, అయితే రమణ జాగర్లమూడి, నిశాంత్ కటారి సినిమాటోగ్రఫీ మెరుగ్గా ఉంది.జీవన్ బాబు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కొంచెం ఎక్కువగా వినిపించినప్పటికీ, దృశ్యాలకు కాస్త బలం చేకూర్చింది. సినిమాలో ఒక్క పాట మాత్రమే ఉన్నా, ఆ పాట ఆకట్టుకునే విధంగా ఉంది. కలి పాత్రతో పాటు అతని నివాసం డిజైన్ అద్భుతంగా నిలిచాయి.లీలా గౌతమ్ వర్మ చిన్న బడ్జెట్‌తో నిర్మించబడినప్పటికీ, సినిమా నిర్మాణ విలువలు స్పష్టంగా కనిపించాయి.

# షూటింగ్ ప్రారంభానికి యూనిట్ సిద్ధమవుతోంది



దసరా తర్వాత మాస్ మహారాజా రవితేజ ధమాకా మొదలువుతందా? అంటే అవుననే తెలుస్తోంది. ఏంటి ధమాకా అంటే దసరా సందర్భంగా ఉండాలి గానీ...పండగ వెళ్లిన తర్వాత దసరా ఏంటి? అనుకుం టున్నారా? అయితే వివరాల్లోకి వె ళ్లాల్సిందే. రవితేజ కథనాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. అయితే యాక్షన్ సన్నివేశాల షూటింగ్ కారణంగా రవితేజ గాయపడటంతో తాత్కాలికంగా షూటింగ్ ఆపేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి రవితేజ విశ్రాంతి లోనే ఉన్నారు. ఇల్లు దాటి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఇంట్లోనే సమయాన్ని గడుపుతున్నారు. తాజాగా రవితేజ కోలుకోవడంతో మళ్లీ తిరిగి షూటింగ్ ప్రారంభానికి యూనిట్ సిద్దమవుతోంది. దీనిలో భాగంగా ఈనెల 14 నుంచి కొత్త షెడ్యూల్ మొదలవుతుందని సమాచారం. సుదీర్ఘంగా సాగే షెడ్యూల్ ఇది. ఇందులో కొన్ని యాక్షన్ సన్నివేశాలతో పాటు టాకీ పార్టు చిత్రీకరణ ఉంటుందని సమాచారం. అప్పటి నుంచి రవితేజ విశ్రాంతి లోనే ఉన్నారు. ఇల్లు దాటి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఇంట్లోనే సమయాన్ని గడుపుతున్నారు. తాజాగా రవితేజ కోలుకోవడంతో మళ్లీ తిరిగి షూటింగ్ ప్రారంభానికి యూనిట్ సిద్దమవుతోంది. దీనిలో భాగంగా ఈనెల 14 నుంచి కొత్త షెడ్యూల్ మొదలవుతుందని సమాచారం. సుదీర్ఘంగా సాగే షెడ్యూల్ ఇది. ఇందులో కొన్ని యాక్షన్ సన్నివేశాలతో పాటు టాకీ పార్టు చిత్రీకరణ ఉంటుందని సమాచారం. ప్రేక్షకాభిమానులకు మంచి కిక్కిచ్చే రవితేజ మార్క్ సన్నివేశాలు కొన్ని చిత్రీకరిస్తారుట. అనంతరం సినిమాకి సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ అప్ డేట్ ఇవ్వబోతున్నారుట. అది టీజర్ అవ్వొచ్చని గెస్సింగ్స్ తెరపైకి వస్తున్నాయి. మరి అది టీజరా? లేక ఇంకేదైనా వినూత్నంగా ప్లాన్ చేస్తున్నారా? అన్నది తెలియాలి. ఇందులో రవితేజకు జోడీగా శ్రీలీల నటిస్తోంది. ఇద్దరి మధ్య వయసు వ్యత్యాసం ఉన్నా? కెమిస్ట్రీ సూపర్ అని ధమాకా చిత్రం ప్రూవ్ అయింది. అందుకే రాజా మరోసారి ఆమెనే హీరోయిన్ గా తీసుకున్నారు. పైగా ధమాకా మంచి విజయం సాధించిన చిత్రం. ఆ తర్వాత నటించిన చిత్రాలన్ని ఫ్లాప్ అయ్యాయి. అలా రాజాకి శ్రీలీల ఎంట్రీ అన్నది చిన్న సెంటిమెంట్ గా కూడా కలిసొచ్చింది. ఇందులో రవితేజ ఆర్పీఎఫ్ అధికారి పాత్ర పోషిస్తున్నాడు. అన్ని పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది సమ్మర్ లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు.

## వార్ 2 సెట్ లో అడుగుపెట్టిన ఎన్టీఆర్!!



దేవర సినిమాతో తెలుగు సినీ ప్రేక్షకులను అలరించిన జూనియర్ ఎన్టీఆర్, తన తదుపరి ప్రాజెక్ట్‌గా బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ ఫ్రాంచైజీ 'వార్' సిరీస్‌లోని రెండవ భాగం 'వార్ 2'లో నటిస్తున్న సంగతి తెలిసిందే. తెలుగు సినిమా ఇండస్ట్రీలో స్టార్ ఎన్టీఆర్ మరియు బాలీవుడ్ యాక్షన్ హీరో హృతిక్ రోషన్ కలిసి నటిస్తున్నఈ చిత్రం ప్రస్తుతం చర్చలు రేపుతోంది. ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి, ముఖ్యంగా ఈ ఇద్దరు నటుల కలయికను చూస్తుండటంతో అందరిలో ఆసక్తి నెలకొంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో ఎన్టీఆర్ మరియు హృతిక్ రోషన్ కలిసి ఒక క్రేజీ డ్యాన్స్ నంబర్ చేయబోతున్నారు. ఈ ప్రత్యేక డ్యాన్స్ కోసం ప్రత్యేకంగా సెట్స్ ఏర్పాటు చేసి, షూటింగ్ జరుపుతున్నారు. ఈ నృత్యాన్ని ప్రఖ్యాత కొరియోగ్రాఫర్ వైభవ్ మీర్చంట్ రూపొందిస్తున్నారు, ఇది సినిమా యొక్క ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. 'వార్ 2' సినిమాకు సంబంధించిన నటీనటుల జాబితాలో ఎన్టీఆర్, హృతిక్ రోషన్ మరియు కియారా అద్వాని ఉన్నాయి,



## పండంటి బిడ్డకు జన్మనిచ్చిన హీరోయిన్ చిత్ర శుక్లా

టాలీవుడ్ స్టార్స్ చాలామంది ఇటీవల కాలంలో తల్లిదండ్రులయిన విషయం తెలిసిందే. నిన్న మొన్నటిదాకా వరుసగా టాలీవుడ్ లో పెళ్లి బాజాలు మోగగా, ఇప్పుడేమో వరుసగా పేరెంట్స్ అవుతూ వార్తల్లో నిలుస్తున్నారు పలువురు సెలబ్రిటీ కపుల్స్. తాజాగా తెలుగులో పలు సినిమాల్లో హీరోయిన్ గా నటించి మంచి గుర్తింపును సంపాదించుకున్న హీరోయిన్ చిత్ర శుక్లా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అది కూడా కరెక్ట్ గా తన పెళ్లి ముహూర్తానికి గుడ్ న్యూస్ అందింది అంటూ సోషల్ మీడియా వేదికగా ఈ శుభవార్తను అభిమానులతో పంచుకుంది. హీరోయిన్ చిత్రా శుక్లా సోషల్ మీడియా వేదికగా తను పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది అన్న విషయాన్ని పోస్ట్ చేసింది. నాలుగు రోజుల క్రితమే అంటే సెప్టెంబర్ 30న రాత్రి 9:31 తనకు బిడ్డ పుట్టాడని వెల్లడించిన బ్యూటీ, ఇదే ముహూర్తానికి తమకు పెళ్లి జరిగిందని, ఇప్పుడు అదే ముహూర్తానికి బాబు పుట్టడంతో ఆ టైమ్ అనేది తనకు మరింత స్పెషల్ గా మారింది అంటూ ఇంస్టాగ్రామ్ లో తన న్యూ బార్న్ బేబీ ఫోటోలను షేర్ చేసింది. ఆ ఫోటోలో అప్పుడే పుట్టిన చిత్రా శుక్లా వారసుడు చూడడానికి క్యూట్ గా ఉన్నాడు. ప్రస్తుతం ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ బ్యూటీ 2023 డిసెంబర్ లో వైభవ్ ఉపాధ్యాయ అనే పోలీసు అధికారిని పెళ్లాడింది. ఇప్పుడు మగ బిడ్డని ప్రసవించి, ఆ ఆనందాన్ని అభిమానులతో పంచుకుంటూ కొడుకు ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీంతో అభిమానులు ఈ సెలబ్రిటీ కపుల్ పేరెంట్స్ గా మారినందుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కాగా చిత్రా శుక్లా ఇండోర్ కు చెందిన అమ్మాయి. 2014 నుంచి ఈ బ్యూటీ సినిమాలు చేస్తూ వస్తోంది. బ్యాగ్రౌండ్ డాన్సర్ గా కెరీర్ ని మొదలు పెట్టిన ఈ హీరోయిన్ 2017లో రిలీజ్ అయిన 'మా అబ్బాయి' అనే తెలుగు సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ కి పరిచయమైంది. పెద్దగా పాపులర్ కాకపోయినా చాలా వరకు సినిమాలలో నటించింది. తెల్లవారితే గురువారం, సిల్లీ ఫెలో, రంగుల రాట్నం, హంట్, పక్కా కమర్షియల్, ఉనికి, మస్తు షేడ్స్ ఉన్నయ్ రా, కలియుగ పట్టణం వంటి ఎన్నో సినిమాల్లో నటించి మంచి గుర్తింపును దక్కించుకుంది. మరి పెళ్లయిన తర్వాత ఈ హీరోయిన్ సినిమాల్లో నటిస్తుందా లేదంటే పర్సనల్ లైఫ్ కి పరిమితం అయిపోతుందా అనేది చూడాలి.